క్లుప్తంగా

ధరలు తగ్గించాలని వినతి



నర్సంపేట రూరల్ : వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన పత్తి విత్తనాల (450గ్రాములు) ప్యాకెట్ గతంలో రూ.700లు ఉండగా కేంద్ర ప్రభుత్వం ఈఏడాది రూ.743గా పెంచింది. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డూరి రాజు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కత్తుల కొమురయ్య డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ ఉమారాణికి వినతిపత్రాన్ని అందించారు. నాయకులు బానోత్ జవహర్‌లాల్, అడ్డూరి మనోహరచారి, అల్లం నారాయణ, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



చెన్నారావుపేట : గొల్లకురుమలకు గొర్రెల పంపిణీలో నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న జరిగే చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) మండల కార్యదర్శి జక్క రవి తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో చలో కలెక్టరేట్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మండల ఉపాధ్యక్షుడు కుండె కుమారస్వామి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా గొల్లకురుమలకు ఏ విధంగా నగదు బదిలీ చేశారో అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగదు బదిలీ ద్వారానే గొల్లకురుమలకు న్యాయం జరుగుతుందన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి గొర్రెల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గొర్రెల పంపిణీలో గొర్రెలు తీసుకోని వారికి బీసీ కార్పొరేషన్ లోన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొరె పెద్ద మల్లయ్య, రవి, మల్లయ్య, చిట్టి లింగయ్య, బాబు, ఐలుమల్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



వర్ధన్నపేట : జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జీ) గ్రామానికి చెందిన గుండా ధనలక్ష్మి బుధవారం తిర్మాలయపల్లి రోడ్డు క్రాస్ రోడ్డు వద్ద తన సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఇదే విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 24గంటల్లో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్ ఎక్కడ ఉందో తెలుసుకుని గురువారం ఎస్సై రామారావు, పోలీసులు బాధిత మహిళకు ఫోన్ అప్పగించారు.

విమర్శలను తిప్పికొట్టాలి

పర్వతగిరి : యువత సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ అరూరి విశాల్ సూచించారు. ఈ మేరకు మండలంలోని అనంతరం, మూడెత్తులతండా పంచాయతీలలో గురువారం టీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి


మల్లేష్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : గుండెపోటుతో జీపీ కార్మికుడు మృతిచెందిన సంఘటన నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన గజ్జి మల్లేష్(52) జీపీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 2గంటల సమయంలో ఛాతిలో తీవ్ర నొప్పిరావడంతో కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే మల్లేష్‌ను తీసుకోని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. వరంగల్‌కు రేఫర్ చేయగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించే సరికి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయురాలు..


మేరి సుశీల(ఫైల్)

సంగెం : అనారోగ్యంతో బాధ పడుతూ ప్రధానోపాధ్యాయురాలు బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎంఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. సంగెం మండలంలోని కొత్తగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న బి.మేరి సుశీల(58) రెండు సంవత్సరాలుగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. మేరి సుశీలకు భర్త ఆనందం, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మూడేళ్లయినా కమీషన్ రాలే.!

- పీఏసీఎస్‌కు అందని మొక్కజొన్న సేకరణ కమీషన్
- రావాల్సింది రూ.13.50 లక్షలు
- జమచేయాలని కోరుతున్న పాలకవర్గం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మారం రంగారెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి(ఫైల్)

నల్లబెల్లి : రైతులకు మద్దతు ధర కల్పించేందుకు గ్రామాల్లో మార్క్‌ఫెడ్ సహకారంతో నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 2020సంవత్సరంలో మూడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి మార్క్‌ఫెడ్ సంస్థ రాష్ట్ర చైర్మన్ మారం రంగారెడ్డి ప్రారంభించారు. కాగా పీఏసీఎస్‌కు చెల్లించాల్సిన కమీషన్‌ను మాత్రం మూడేళ్లు పూర్తి అయినా అందించడం లేదు. దీంతో పాలక వర్గం సభ్యులు తమకు రావాల్సిన కమీషన్ నగదును ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు.

రావాల్సిన కమీషన్ రూ.13.50 లక్షలు

మండలంలో నల్లబెల్లి, మూడుచెక్కలపల్లి, మేడపల్లి గ్రామాల్లో మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మూడేళ్ల క్రితం దాదాపు 1.62లక్షల బస్తాల మొక్కజొన్నలను రైతులనుంచి కొనుగోలు చేశారు. ఈ లెక్కన కొనుగోలు కమీషన్ రూ.13.50 లక్షలు సంఘానికి రావాల్సి ఉంది. ఈ కమీషన్‌ను కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఖర్చులు తీసివేయగా, మిగిలిన డబ్బులను సంఘం ఖాతాలో జమచేస్తారు. వచ్చిన కమీషన్ డబ్బులను సంఘం ఆర్థికంగా బలోపేతం కావడానికి అవకాశం ఏర్పడుతుంది. అయితే మొక్కజొన్నలు కొనుగోలు చేసి మూడేళ్లు పూర్తైనా ప్రభుత్వం కమీషన్ విడుదల చేయకపోవడంతో తాము చేసిన కష్టానికి ప్రతిఫలం కూడా పొందలేక పోతున్నామని పాలకవర్గం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సభ్యులు కోరుతున్నారు.

కమీషన్ వెంటనే చెల్లించాలి



మొక్కజొన్న కొనుగోలుకు సంబంధించిన కమీషన్ మూడేళ్లు పూర్తి అయిన ఇంకా రాలేదు. సంఘానికి కమీషన్ చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రావాల్సిన కమీషన్ సంఘం ఖాతాలో జమచేయాలి.

– చెట్టుపల్లి మురళీధర్, పీఏసీఎస్ చైర్మన్

ఎక్కువ కాంటా వేస్తే కఠిన చర్యలు


వర్ధన్నపేట: రైతులతో మాట్లాడుతున్న సీఐ

వర్ధన్నపేట : తరుగు పేరుతో రైతుల వద్ద నుంచి ఎక్కువ కాంటా వేస్తే కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట సీఐ సదన్‌కుమార్ అన్నారు. గురువారం వర్ధన్నపేట పరిధిలోని డీసీ తండా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో సదన్‌కుమార్ మాట్లాడారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడుతున్నాయా అని ఆరా తీశారు. త్వరిత గతిన కాంటాలు వేయడంతో పాటు ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు.

దోపిడీని అరికట్టి రైతులకు న్యాయం చేయాలి

సంగెం : కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని షాపూర్, లోహిత, ఆశాలపల్లి, కాపులకనపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు సంఘం ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాపూర్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 15రోజులైనా ఇప్పటి వరకు కాంటాలు వేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తరుగు పేరుతో కోత విధిస్తున్నారో తెలియకుండా క్వింటాకు 10కిలోల వరకు దోపిడీ చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం దోపిడీని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం : ప్రభుత్వ ఆదర్శ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధరావుపేట మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ దామెర రాజేందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం సైతం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. స్కాలర్‌షిప్, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తుల పంపిణీ ఉందని తెలిపారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో అడ్మిషన్లు షురూ

గీసుకొండ : మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్/జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ(40 సీట్లు), బైపీసీ(40), సీఈసీ(40), ఎంఈసీ(40) సీట్లకు అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ బి.నాగేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోపు దగ్గరలోని మీ సేవా కేంద్రాల్లో లేదా ఇంటర్‌నెట్ సెంటర్లలో విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి లిస్టును జూన్ 12న కళాశాల బోర్డుపై ప్రదర్శిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ ప్రతులు, పదో తరగతి షార్ట్ మెమో, 3ఫొటోలు, ఆధార్, ఆదాయ పత్రాలు, బ్యాంకు పాస్‌పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుని కాలేజీలో సంప్రదించాలన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలి


లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నర్సంపేట : భవన నిర్మాణ కార్మికుల వివాహ, ప్రసూతి, మరణ సాయం కోసం ఆన్‌లైన్ చేసిన క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొరబోయిన కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ సెంటర్ నుంచి లేబర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట సర్కిల్ పరిధిలోని ఏడు మండలాల లేబర్ కార్డు క్లెయిమ్స్ ఆన్‌లైన్ ఫైల్స్ అధికారులకు చేరవేయడంలో స్థానిక అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ తీవ్ర జాప్యం చేయడం వల్ల కార్మికులకు ప్రభుత్వ సాయం అందడం లేదన్నారు. నిర్మాణ కార్మికులకు పనులు దొరకక చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. కార్మిక సంక్షేమ బోర్డులో వందల కోట్ల రూపాయల నిధులు ఉన్నప్పటికి క్లెయిమ్స్‌ను నోడల్ ఆఫీసర్‌కు చేరవేయడంలో స్థానిక లేబర్ ఆఫీసర్ నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బుర్రి ఆంజనేయులు, లింగాల భాస్కర్, మినుముల భారతి, చంద్రకళ, తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

నెక్కొండ : విద్యార్థులు ఇష్టపడి చదివి సమాజం గర్వించేలా ఉన్నతులుగా ఎదగాలని నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణ అన్నారు. ఈ మేరకు గురువారం ఇంటర్మీడియట్ సెకండియర్‌లో కళాశాల టాపర్ అక్షయ్ ఎంపీసీలో 938, ద్వితీయ స్థానంలో పి.శివ ఎంపీసీలో 872, తృతీయ స్థానంలో ఎం.వెంకన్న బైపీసీలో 724, ఫస్టియర్‌లో పి.అక్షయ్ ఎంపీసీలో 374 ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చందా రమణాకర్, ఎం.బాబు, ప్రభాకర్, సంపత్, ఆనందం, శ్రీలత, రంజిత్‌కుమార్, కీర్తి, భిక్షపతి, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


వర్ధన్నపేట: సంగెపు వాగు బ్రిడ్జి సమీపంలో పరిశీలిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి వర్ధన్నపేటలో రోడ్డు ప్రమాదాల నివారణకు డీసీ తండా నుంచి ఇల్లంద వరకు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్, వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ సదన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, డీఈఈ, ఎస్సై రామారావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వర్ధన్నపేట, డీసీతండా, ఇల్లంద ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎలా జరిగాయని పరిశీలించారు. వేగ నియంత్రణ కోసం డీసీ తండా, ఇల్లంద, ఆకేరు వాగు బ్రిడ్జి, సంగెపు వాగు బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియంత్రణ సూత్రాలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ప్రత్యేక చొరవ తీసుకోవాలి

రాయపర్తి: రోడ్డు భద్రతా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఏసీపీలు మధుసూదన్, శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై నేషనల్ హైవే అధికారులతో రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ సదన్‌కుమార్, ఎస్సై బండారి రాజు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

వర్ధన్నపేట : వర్ధన్నపేట పరిధిలోని భవానికుంట తండా శివారులోని పంట పొలాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో పంట పొలాలకు వెళ్లాలంటేనే గిరిజన రైతులు భయపడుతున్నారు. చేతికి అందివచ్చిన వరి పంట కోతకు హార్వెస్టర్ రావాలంటే తీగలను పైకి ఎత్తిన తర్వాతనే వస్తామని చెప్పడంతో విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి ప్రమాదాలను నివారించాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

చేయూత


నగదు అందజేస్తున్న మెపా ప్రతినిధులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన పిట్టల కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అతడి కూతుర్ల చదువు కోసం ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్(మెపా) ప్రతినిధులు దాతల నుంచి రూ.28వేలను సేకరించారు. ఆ మొత్తాన్ని పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను మృతుడి భార్య కవిత, పిల్లలకు మెపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ గురువారం అందించారు. గుండ్ర చంద్రశేఖర్, పెండెం మధుసూధన్, రేగుల మొగిలి, భూమ భిక్షపతి, తక్కెల్ల నరేశ్, పిట్టల సతీష్, రవి, బిల్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ సాగుతో భూసారం పెంపు

వర్ధన్నపేట : జీలుగ సాగుతో భూసారం పెరుగుతుందని ఇల్లంద సర్పంచ్ సుంకరి సాంబయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇల్లంద ఆగ్రోస్ కేంద్రంలో సబ్సిడీపై జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ రసాయనిక ఎరువులను తగ్గించుకుని జీలుగ, పచ్చి రొట్టను దుక్కిలో వేసుకుని పూతకు వచ్చే సమయంలో కలియ దున్నితే భూసారం ఎంతో పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

'మంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి'

నర్సంపేట : దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గుంటి వీరప్రకాశ్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వీరప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటులో ఆట పాటల ద్వారా ప్రజలను చైతన్యపర్చి, ప్రత్యేక రాష్ట్రం కోసం దళితులు ఆత్మబలిదానాలు చేసుకుంటే మంత్రి అయ్యావన్న సంగతి మరిచి దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంత్రి అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో దళితుల పట్ల వివక్ష కొనసాగుతోందని, తెలంగాణ ప్రభుత్వం దళితులను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటుందన్నారు. సమాజ అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించే దళితులు భవిష్యత్‌లో తెలంగాణ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతోందన్నారు.

ద్విచక్ర వాహనాలు సీజ్

గీసుకొండ : మండలంలోని ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద వరంగల్–నర్సంపేట రహదారిలో గురువారం హెడ్‌కానిస్టేబుల్ ఎండీ జమీన్, కానిస్టేబుళ్లు వి.రవీందర్, యు.జగన్ వాహనాల తనిఖీ చేపట్టారు. గోపి, విద్యాసాగర్ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌లకు ఉన్న నెంబర్ ప్లేట్‌లను తొలగించి నర్సంపేట వైపు వెళ్తుండగా వారి వాహనాలను తనిఖీ చేసి సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం గీసుకొండ సీఐకి నివేదించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బుడుగులో చిక్కుకున్న గేదె

రాయపర్తి : మండలంలోని మొరిపిరాల శివారు మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గురువారం గుర్తుతెలియని గేదె బుడుగులో చిక్కుకున్నట్లు స్థానికులు తెలిపారు. గేదెను బయటకి తీసినట్లు గుర్తించిన వారు దానిని తీసుకు పోవాలన్నారు.

మహా అన్నదానం

పర్వతగిరి : మండలంలోని తురకలసోమారం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన తోపుచర్ల చలపతిరావు–శారదల వివాహ మహోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


పర్వతగిరి: కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్


దుగ్గొండిలో..

పర్వతగిరి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సూచించారు. మండలంలోని చౌటపల్లి సొసైటీ పరిధిలోని కొంకపాక గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. హమాలీలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలతో పనులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కేంద్రాలకు చేరుతున్న ధాన్యం

ఖానాపురం : పాకాల ఆయకట్టు కింద కోతలు ముమ్మరంగా సాగుతుండటంతో ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా పీఏసీఎస్, రైతు సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువస్తుండటంతో ధాన్యపు రాశులు భారీగా కనిపిస్తున్నాయి. కాగా ఖానాపురం మండల పరిధిలో ఓ రైస్‌మిల్ యజమానులు తిరకాసు పెడుతున్నట్లు తెలిసింది. రైస్‌మిల్లర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

సంగెంలో..

సంగెం : మండలంలోని గవిచర్లలో కాపులకనిపర్తి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొనికెల రమ శ్రీనివాస్, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, దొమ్మాటి సంపత్ గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు కూస కరుణాకర్, ఏఈఓ సాగర్, సీఈఓ రమణచారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి, మహ్మదాపురం, నాచినపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆయా సంఘాల చైర్మన్‌లు ఊరటి మహిపాల్‌రెడ్డి, సుకినె రాజేశ్వర్‌రావు గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. రైతులు దళారులకు వడ్లు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ ధర్మారెడ్డి, సర్పంచ్‌లు, నీలం పైడయ్య, పెండ్యాల మమతరాజు, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, రోజనీల, రాజిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన అన్నబత్తుల వెంకటేశ్వర్‌రావు కుమారుడు అనీష్‌చౌదరి అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా గురువారం బాధిత కుటుంబాన్ని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావును ఓదార్చి ధైర్యం చెప్పారు. మందాటి సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కందికట్ల స్వామి పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని కొంకపాక గ్రామ వార్డుసభ్యుడు మాదాసి రమేష్ తల్లి, వర్కాల కనుకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా వర్ధన్నపేట ఎమ్మెల్యే గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

ఆర్థికసాయం



రాయపర్తి : వడదెబ్బతో మండలకేంద్రానికి చెందిన జెర్రిపోతుల సాయిలు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సాయిలు మృతదేహం వద్ద నివాళులర్పించిన అనంతరం మృతుడి కుమారుడు కుమార్‌కు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సూర్య, ఆర్ఐ చంద్రమోహన్ వీఆర్ఏలు తదితరులు ఉన్నారు.

తనిఖీ చేయాలి

పర్వతగిరి : మండలంలోని శ్రీపద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించాలని మండలంలోని బూర్గుమళ్ల గ్రామానికి చెందిన వినియోగదారుడు బొబ్బాల ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి బంక్‌లో వ్యవసాయ ట్రాక్టర్ డీజిల్ కోసం వెళ్లి డీజిల్ పోయించగా తక్కువగా వచ్చింది. దీంతో బంక్ వారిని డీజిల్ ఎందుకు తక్కువగా వచ్చిందని నిలదీయగా నిర్లక్ష్యంగా మాట్లాడారని తెలిపాడు. తక్షణమే తూనికల కొలతల అధికారులు బంక్‌లో తనిఖీలు చేపట్టి తగు చర్యలు చేట్టాలని కోరాడు.

శివాలయ నిర్మాణానికి సహకరిస్తా..

దామెర: మండలంలోని వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయాన్ని గురువారం పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం ఇనగాల ట్రస్ట్‌ద్వారా తనవంతు సాయం త్వరలోనే అందిస్తానని హామీ ఇచ్చారు.